ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
సోమవారం 15 ఏప్రిల్ 2024

పేదల జీవితాల్లో మార్పే లక్ష్యం


మంగళూరు రోడ్ షోలో ప్రధాని మోదీ


ప్రసంగిస్తున్న ప్రధాని

- సంకల్పపత్రానికి మోదీనే గ్యారెంటీ
- కన్నడ భాషలో మాట్లాడి ఆకట్టుకున్న ప్రధాని..
- మైసూరులో విజయ సంకల్ప సమావేశం సక్సెస్
- జై శ్రీరామ్ అంటూ నినాదాలు
- లక్షలాదిమంది కార్యకర్తల హాజరు

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిష్కరించిన 'సంకల్పపత్రం మోదీ గ్యారెంటీ' అని, 'పేదల జీవితాల్లో మార్పు తేవడమే తమ మేనిఫెస్టో లక్ష్యమని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. మైసూరులో ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం భారీ బహిరంగసభ నిర్వహించారు. 'ఎల్లరిగూ నన్న నమస్కారగళు' అంటూ కన్నడలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగించి ఆకట్టుకున్నారు. శ్రీరామనవమి నేపథ్యంలో నాడదేవత చాముండేశ్వరి దేవి ఆశీస్సులు పొందేందుకు వచ్చానన్నారు. కన్నడతాయి భువనేశ్వరి, కావేరిమాతకు నమస్కారాలన్నారు. కన్నడ రాజకీయ కురువృద్ధుడు దేవెగౌడ ఆశీస్సులు ఉన్నాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రప్రజలందరూ ఆశీస్సులు అందించాలని ఆకాంక్షించారు. 'విజయ సంకల్ప సమావేశం' పేరిట నిర్వహించిన సమావేశంలో బీజేపీ-జేడీఎస్ మైత్రి కూటమి నేతలు పాల్గొన్నారు. మైసూరు-కొడగు, చామరాజనగర, మండ్య, హాసన్ లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థులు యదువీర్, ఎస్ బాలరాజు, హెచ్‌డీ కుమారస్వామి, ప్రజ్వల్ రేవణ్ణ సహా జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ సీఎం యడియూరప్ప పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడుతూ బీజేపీ మేనిఫెస్టో దేశ భవిష్యత్తు మార్పును ఆవిష్కరిస్తుందన్నారు. 3 కోట్ల కొత్త ఇళ్ల నిర్మాణం, పేదలకు ఐదేళ్లపాటు ఉచిత రేషన్, 70 ఏళ్లపైబడినవారికి ఉచిత వైద్యం, 3 కోట్ల మహిళలను లక్షాధికారులను చేస్తామన్నారు. ఎక్స్‌ప్రెస్ వే, వాటర్ వే, ఎయిర్‌వే ద్వారా భారతదేశం ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశంగా మారుతోందన్నారు. ఒకప్పుడు టెక్నాలజీ కోసం భారత్ ఇతరదేశాలవైపు చూసేదని ప్రస్తుతం మూన్‌ల్యాండింగ్ వంటి సరికొత్త ఆవిష్కరణలు చేశామన్నారు. తక్కువధరకు ఔషధాలు, వాహనాల ఉత్పత్తి చేయబోతున్నామన్నారు. బెంగళూరు దేశంలోనే ఐటీ హబ్‌గా పేరొందిందని, వీటన్నింటినీ యువత గరిష్ఠంగా సద్వినియోగం చేసుకోవడం ద్వారా కన్నడకు మరింత గుర్తింపు సాధ్యమన్నారు. మైసూరు, హంపి, బాదామి తదితర ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, మహిళలకు రిజర్వేషన్, రామమందిర నిర్మాణం ఇలాంటివి అమలు చేసి చూపించామన్నారు. మీ ఒక్క ఓటుతో మోదీ గ్యారెంటీ పెరుగుతుందని దేవెగౌడ, యడియూరప్ప, కుమారస్వామిల నాయకత్వం మనవెంట ఉందన్నారు. ఇదే సందర్భంగా కవి కువెంపు, సుత్తూరు మఠం, మార్షల్ కరియప్ప సేవలను ప్రస్తావించారు. పిల్లలను దేశసేవకు పంపాలన్నారు.


నేతల సంఘీభావం

వందల కోట్ల బ్లాక్ మనీ తరలించారు...

కర్ణాటక నుంచి కాంగ్రెస్ పార్టీ వందల కోట్ల బ్లాక్‌మనీ తరలించారని ప్రధాని మోదీ ఆరోపించారు. మైసూరు బహిరంగ సభలో మాట్లాడిన ఆయన రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఏటీఎంలా వాడుకుంటోందన్నారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ డ్రామాలాడుతున్నారని ధ్వజమెత్తారు. రామమందిరం ప్రాణ ప్రతిష్ఠ ఆహ్వానాన్ని తిరస్కరించి కాంగ్రెస్ హిందుత్వాన్ని అవమాన పరిచిందన్నారు. హిందుత్వాన్ని నాశనం చేయడానికి కాంగ్రెస్ దేశ విద్రోహులతో జత కట్టిందన్నారు. పేదలకు ఉచిత బియ్యం, 70ఏళ్ల వయస్సు పై పడిన వారికి అయూష్మాన్ భారత్, ప్రతి ఇంటివద్దకూ పైపు ద్వారా గ్యాస్, ఇంటింటికీ నల్లా నీళ్లు ఇలా అనేక పథకాలతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మోదీ పేర్కొన్నారు. మైసూరు, మంగళూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభ విజయవంతం కావడంతో బీజేపీ వర్గాల్లో ఉత్తేజం నెలకొంది.

మోదీ నాయకత్వాన్ని బలపరుద్దాం : యడియూరప్ప

ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరుద్దామని యడియూరప్ప పిలునిచ్చారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ప్రపంచం మెచ్చిన నరేంద్రమోదీని మళ్లీ ప్రధాని చేసేందుకు బీజేపీకి ఓటు వేయాలన్నారు. అంబేడ్కర్ జయంతి రోజున ప్రధాని మోదీ మైసూరు రావడంత సంతోషంగా ఉందన్నారు. బీజేపీ-జేడీఎస్‌లు కలసికట్టుగా పోటీ చేస్తున్నాయని 28 స్థానాల్లోనూ గెలుపు సాధించాలన్నది లక్ష్యమన్నారు.

బీజేపీకి మద్దతుపై హర్షం : దేవెగౌడ

ప్రధాని నరేంద్రమోదీకి మద్దతు ఇవ్వడం సంతోషంగా ఉందని జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామన్నారు. తన రాజకీయ జీవితంలో బీడీఏ, బీబీఎంపీ, బెంగళూరు ప్లానింగ్ అథారిటీ, ఇరిగేషన్ వంటి పనితీరు చూశానన్నారు. కాగా ఇతర రాష్ట్రాల్లో బీజేపీని ఓడించేందుకు కర్ణాటక నుంచి నిధులు తరలాయని దేవెగౌడ ఆరోపించారు. రాష్ట్రంలోని 28 ఎంపీ స్థానాలను గెలిపించి మళ్ళీ బీజేపీ అధికారంలోకి రావాలన్నారు.

ప్రధాని కలలను సాకారం చేద్దాం : నటి సుమలత

ప్రధాని నరేంద్రమోదీ కలలను సాకారం చేద్దామని నటి సుమలత పిలుపునిచ్చారు. ఇందుకు మనమంతా ఈనెల 26, మే 7 తేదీలలో ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈసారి మళ్లీ మోదీ ప్రభుత్వం వచ్చేలా మనం బీజేపీకి మద్దతు ఇవ్వాలన్నారు.

మంగళూరులో ప్రధాని రోడ్‌షో

ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనలో భాగంగా దక్షిణకన్నడ జిల్లా కేంద్రమైన మంగళూరులో ఆదివారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోకు విశేష స్పందన లభించింది. ప్రత్యేక విమానంలో మంగళూరుకు చేరుకున్న ఆయనకు బీజేపీ నేతలు ఆత్మీయ స్వాగతం పలికారు. లాల్‌బాగ్, బల్లాళ్‌భాగ్, పీవీఎస్‌ల మీదుగా రోడ్‌షో సాగి నవభారత్ సర్కిల్‌లో రోడ్‌షో ముగిసింది. సుమారు గంటపాటు సాగిన రోడ్‌షోలో ప్రధానిని దగ్గరనుంచి చూసేందుకు ప్రజలు, కార్యకర్తలు ఉత్సాహంగా తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌పీజీ బలగాలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. రోడ్‌షోలో దక్షిణకన్నడ బీజేపీ అభ్యర్థి కెప్టెన్ బ్రిజేశ్ చౌట, ఉడుపి-చిక్కమగళూరు బీజేపీ అభ్యర్థి కోట శ్రీనివాసపూజారి పాల్గొన్నారు. రోడ్‌షో పొడవునా ప్రజలు పుష్పాలు వేసి స్వాగతించారు. ప్రధాని నరేంద్రమోదీ చిరునవ్వుతో కమలం చేతబట్టుకుని సాగారు. బీజేపీకి ఎందుకు ఓటు వేయాలో వివరిస్తూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

కాంగ్రెస్‌పై విమర్శలు

మోదీ తన ప్రసంగంలో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ని తుకడా తుకడా గ్యాంగ్ అంటూ అభివర్ణించారు. దేశాన్ని విభజించే పార్టీ అంటూ ధ్వజమెత్తారు. భారతదేశానికి వ్యతిరేకంగా మాట్లాడేవారికి కాంగ్రెస్ టిక్కెట్ ఇస్తుందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికల ర్యాలీలో భారత్‌మాతాకీ జై నినాదాలకు అభ్యంతరం వ్యక్తం చేశారని అటువంటి పార్టీకి ఓటు వేస్తారా..? అంటూ మోదీ ప్రశ్నించారు. వందేమాతరానికి కాంగ్రెస్ వ్యతిరేఖమన్నారు. విదేశాల్లో భారత్ పట్ల కాంగ్రెస్ నేతలు విమర్శలు చేశారని వ్యాఖ్యానించారు. కాగా సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ ఆధారాలు ఇవ్వాలని అడిగే బుద్ధి కాంగ్రెస్ వారిదని విమర్శించారు. ఇలాంటి వారి చేతుల్లోకి దేశపాలన ఇవ్వడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. దేశ భవిష్యత్తు బాగుండాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు.


ప్రధాని మోదీ సభలో ఉత్సాహంగా కార్యకర్తలు

500ఏళ్ల కల సాకారమైంది

అయోధ్యలో శ్రీరామమందిరం నిర్మాణం చేపట్టడం ద్వారా 500ఏళ్ల కల సాకారమైందన్నారు. అయితే శ్రీరాముడి ప్రతిష్ఠాపనను కాంగ్రెస్, ఇండియా కూటమి మాత్రం బహిష్కరించడం ద్వారా ప్రజల మనోభావాలను కించపరిచారన్నారు. మోదీకి ప్రజల ఆశీస్సులు ఉన్నంతకాలం కాంగ్రెస్ విద్వేషం పనిచేయదన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు 2047 నాటి వికసిత భారత్ భవిష్యత్‌ను నిర్ధారించనుందన్నారు. దేశ అభివృద్ధికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్సాహంగా సీటీ రవి ప్రసంగం

బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీటీ రవి తన ప్రసంగంలో జై శ్రీరామ్, భోలో భారత్‌మాతాకీ జై అని నిదాలు చేయడం ద్వారా కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఆయన ప్రసంగం ఆద్యంతం కార్యకర్తలు ఈలలు వేశారు. అంబేడ్కర్ జయంతి లేని రాజ్యాంగం ఊహించుకోలేమన్నారు. అంబేడ్కర్ జయంతి రోజున భారీ సమావేశం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. దేశాన్ని కాపాడే ఎన్నికలు కావడంతో అందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యకర్తల నినాదాలతో హోరెత్తింది.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు సీఎం సిద్దరామయ్య సహా పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఆదివారం 133వ జయంతి సందర్భంగా ఉదయం విధానసౌధలో అంబేడ్కర్ విగ్రహానికి సీఎం సిద్దరామయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో జగన్నాథ్‌భవన్‌లో అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, సీటీ రవి, ప్రతిపక్షనేత అశోక్ తదితరులు పాల్గొన్నారు. జేడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌డీ కుమారస్వామి తదితరులు పాల్గొని అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

రాజ్యాంగం వల్లే మోదీ పీఎం..

గొర్రెలు కాచిన తాను రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినా.... రైల్వే స్టేషన్‌లో టీ అమ్ముకునే నరేంద్ర మోదీ పీఎం అయినా అది రాజ్యాంగం వల్లే అని సీఎం సిద్దరామయ్య ట్వీట్ చేశారు. రాజ్యాంగాన్ని మార్చే సాహసం చేసిన వారే నిజమైన దేశ ద్రోహులంటూ విమర్శలు గుప్పించారు. దేశ రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తున్న ఆర్ఎస్ఎస్ దేశానికి ప్రమాదకరమని పేర్కొన్నారు.

బీబీఎంపీ ఆధ్వర్యంలో

బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) కేంద్ర కార్యాలయంలో కమిషనర్ తుషార్‌గిరినాథ్ నేతృత్వంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. బీబీఎంపీ పాలనాధికారి రాకేశ్‌సింగ్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అంబేడ్కర్ ఆశయాలు, సాధనలను వివరించారు. ప్రత్యేక కమిషనర్ మునీశ్ మౌద్గల్, డాక్టర్ కే హరీశ్‌కుమార్, ప్రీతి గెహ్లాట్, ప్రాంతీయ కమిషనర్ రమ్యా, శివానంద్ కపాశి, స్నేహల్, సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ విభాగం జాయింట్ కమిషనర్ ప్రతిభా, ఇంజనీరింగ్ విభాగం ముఖ్యులు ప్రహ్లాద్, రెవెన్యూ విభాగం జాయింట్ కమిషనర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం సిద్దరామయ్య

ఓటు హక్కు గోప్యతపై సందేహం వద్దు

- చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ మీనా

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో సీనియర్ సిటిజన్‌లు, దివ్యాంగులు వినియోగించుకుంటున్న ఓటు హక్కు గోప్యతకు భంగం వాటిల్లదని, ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ పరచే సమస్యే లేదని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి ఏజెంట్ ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తున్నామన్నారు. రాజాజీనగర్ ప్రాంతం 108వ వార్డు శ్రీరామమందిరలో 85ఏళ్ల పైబడిన వారు ఓటు హక్కు వినియోగంపై గోప్యత కాపాడలేదని, ఇది ఇతర ఓటర్లపై ప్రభావం చూపుతుందన్న కాంగ్రెస్ అభ్యర్థి ఏజెంట్ ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై అత్యవసరంగా దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, బీబీఎంపీ కమిషనర్‌కు సూచించామన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారులు నివేదిక సమర్పించారన్నారు. ఓటింగ్ వేళ వీడియో చిత్రీకరణ, ఫొటోలను తీశారని మైక్రో అబ్జర్వర్స్ నివేదికను పరిశీలించాక ఓటు బహిరంగం కాలేదని స్పష్టమయ్యిందన్నారు. ఒక ఇంటి నుంచి మరో ఇంటికి వెళ్లే వేళ పీఆర్‌ఓ ఎన్నికల గుర్తింపుకార్డు పోగొట్టుకున్నారని, ఇతర అధికారులు మాత్రం ఐడీ కార్డులు ధరించి విధులు నిర్వహించారన్నారు. ఆ పీఆర్‌ఓకు వెంటనే మరొక ఐడీ కార్డును మంజూరు చేశా మన్నారు. మీడియా సమావేశంలో ఇతర అధికారులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ మీనా

లేడీస్..నోచాన్స్..!

- లోక్‌సభలో రాష్ట్రం నుంచి మహిళలకు ప్రాతినిధ్యం అంతంతే..
- 17 సార్లు ఎన్నికల్లో.. ఎంపీలుగా 12మందే..





బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో రాష్ట్రం నుంచి మహిళలకు ప్రాతినిధ్యం ఆశించినంతగా లేదు. చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తామన్న నేతల మాటలు హామీలుగానే మిగిలిపోతున్నాయి. 17సార్లు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటక నుంచి 12 మంది మహిళలు మాత్రమే పూర్తిస్థాయి ఎన్నికల్లో గెలుపొందగా మరో ముగ్గురు ఉప ఎన్నికల్లో విజయం నమోదు చేశారు. కర్ణాటకవైపు దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఎదురుచూసిన ఎన్నికలంటే 1978 నాటిది. చిక్కమగళూరు స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఇందిరాగాంధీ పోటీ చేసి విజయం సాధించారు. ఆమె రాజకీయంగా మలుపు తిరిగింది చిక్కమగళూరు ఎన్నిక ద్వారానే. 1956లో కర్ణాటక రాష్ట్రం ఏర్పడేంత వరకు మైసూరు ప్రాంతంగా పిలిచేవారు. మైసూరు ప్రాంతం నుంచి ఎన్నికైన తొలి మహిళ సరోజిని బిందురావ్ మహిషి. కర్ణాటకగా నామకరణం తర్వాత కూడా 1978లో ఎన్నికైన వారు సరోజిని మహిషి. ఆమె నాలుగుసార్లు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించారు. కర్ణాటకలో ఇప్పటి వరకు జరిగిన రెండు లోక్‌సభ ఎన్నికలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. 1978లో చిక్కమగళూరు నుంచి లోక్‌సభ ఉప ఎన్నికల్లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పోటీ చేసిన సందర్భం. ఆ తర్వాత 1998లో సోనియాగాంధీ కాంగ్రెస్ అభ్యర్థిగాను, సుష్మాస్వరాజ్ బీజేపీ నుంచి బళ్లారి లోక్‌సభ స్థానానికి పోటీ పడిన ఎన్నిక. దేశంలో ఎమర్జెన్సీ తలెత్తిన తర్వాత జరిగిన 1977 ఎన్నికల్లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సొంత నియోజకవర్గమైన ఉత్తరప్రదేశ్‌లోనూ ఓడిపోయారు. చిక్కమగళూరు నుంచి గెలుపొందిన డీబీ చంద్రేగౌడ ఎంపీ పదవికి రాజీనామా చేసి ఇందిరాగాంధీని ఆహ్వానించారు. ఇలా 1978లో జరిగిన ఉప ఎన్నికల్లో ఇందిరాగాంధీ గెలుపొందడం ద్వారా దేశవ్యాప్తంగా చిక్కమగళూరు చర్చనీయాంశమైంది. 2013 మండ్య ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి సినిమా నటి రమ్య (దివ్య స్పందన) విజయం సాధించారు. 2021లో కేంద్ర రైల్వే మంత్రిగా వ్యవహరిస్తున్న సురేశ్‌అంగడి మృతి చెందడంతో ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో మంగళ అంగడి గెలుపొందారు.

రాష్ట్రం నుంచి ఎంపీలుగా ఎన్నికైన మహిళలు

(సాధారణ ఎన్నికలు)

పేరు	పార్టీ	నియోజకవర్గం
సరోజిని మహిషి	కాంగ్రెస్	ధారవాడ
బసవరాజేశ్వరి	కాంగ్రెస్	బళ్లారి
డీకే తారాదేవి	కాంగ్రెస్	చిక్కమగళూరు
చంద్రప్రభ అరసు	కాంగ్రెస్	మైసూరు
రత్నమాలసవనూరు	జేడీయూ	చిక్కోడి
సోనియాగాంధీ	కాంగ్రెస్	బళ్లారి
మార్గరెట్ ఆళ్వా	కాంగ్రెస్	ఉత్తరకన్నడ
తేజస్విని రమేశ్	కాంగ్రెస్	కనకపుర
మనోరమ మధ్వరాజ్	బీజేపీ	ఉడుపి
జె.శాంత	బీజేపీ	బళ్లారి
శోభాకరంద్లాజె	బీజేపీ	ఉడుపి-చిక్కమగళూరు
సుమలత అంబరీశ్	స్వతంత్ర	మండ్య

ఉప ఎన్నికల విజేతలు

పేరు	పార్టీ	నియోజకవర్గం
ఇందిరాగాంధీ	కాంగ్రెస్	చిక్కమగళూరు
రమ్య	కాంగ్రెస్	మండ్య
మంగళ అంగడి	బీజేపీ	బెళగావి




మంగళ అంగడి


రమ్య


జె.శాంత


మార్గరెట్ ఆళ్వా, శోభాకరంద్లాజె, సోనియాగాంధీ





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.93	1,577.17
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	162	267
సామర్థ్యం (టీఎంసీలు)	3.97	3.25

రోజువారీ సమస్యలపై చర్చ జరగాలి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 14: ప్రజలు ప్రతి రోజు ఎదుర్కొంటున్న సమస్యలే ఎన్నికల చర్చనీయాంశాలు కావాలని ఎస్‌యూసీఐ లోక్‌సభ అభ్యర్థి దేవదాస్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ ఏ ఒక్కరూ తాగునీరు, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలపై పార్టీల్లో చర్చించడం లేదన్నారు. నగరంలోని సుధా క్రాస్, రైల్వే, రింగ్‌రోడ్డు వంటి అనేక సమస్యలు ఇక్కడి ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని వీటిపై పార్లమెంట్‌లో గళాన్ని వినిపించేందుకు ఎస్‌యూసీఐకి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ ప్రమోద్, ఏ.శాంత, నాగరత్న, ఈశ్వరీ, జగదీశ్, రవికిరణ్ పాల్గొన్నారు.

వేడుకగా అంబేడ్కర్ జయంతి



అంబేడ్కర్ విగ్రహం వద్ద కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 14: భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని నగరంలోని డాక్టర్ బీఆర్, అంబేడ్కర్ భవన్‌లో జిల్లా పరిపాలన, జిల్లాపంచాయితీ, కన్నడ సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సరళంగా ఆచరించారు. లోక్‌సభ ఎన్నికలలో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉండడం వల్ల జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా డాక్టర్ బీఆర్, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని లాంఛనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, అసిస్టెంట్ కమిషనర్ హేమంత్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ ఖలీల్ సాబు, ఏఎస్పీ రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ సతీశ్, ఆహార శాఖ సంయుక్త సంచాలకులు సకీనా కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నోట్లు ముద్రిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 14: నకిలీ నోట్లను ముద్రిస్తున్న ఇద్దరు వ్యక్తులను గాంధీనగర్ పోలీసులు శనివారం సాయంత్రం అరెస్ట్ చేశారు. నగర శివారులోని బిసనల్లి హరిజనకేరె కొల్లాపురమ్మ కాలనీలో నివాసముంటున్న గంగన్న కుమారుడు బసవరాజ్ ఆలియాస్ అశోక్(25) బ్యాంక్ ఆప్ బరోడాలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతనితోపాటు అదేప్రాంతానికి చెందిన హొన్నూర్ స్వామి కుమారుడు హరిశ్(25)ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న కోలాచలం కాంపౌండులోని మోహన్ లాడ్జిలో నోట్లు ముద్రిస్తూ పట్టుబడ్డారు. అరెస్టు చేసిన వారి నుంచి రూ.100 విలువైన 80నోట్లు, జిరాక్స్ మిషన్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ నోట్ల ముద్రణ ఎప్పుడు మొదలైంది? ఎక్కడ నిర్వహించబడింది? బ్యాంక్ ఆఫ్ బరోడాలోని ఇతర నోట్లతో వీటిని కలిపారా????? దీని వెనుక ఎవరి హస్తం ఉందనేది పోలీసుల విచారణ ద్వారా బయటకు రావాల్సి ఉంది.

ఖైరూన్ నిసార్ బేగమ్ మృతి

సిరుగుప్ప, ఏప్రిల్ 14: సౌదాగర్ మసీదు కమిటీ మాజీ అధ్యక్షుడు అండీ హుస్సేన్ బాషా తల్లి ఖైరూన్ నిసార్ బేగమ్ (95) మృతి చెందారు. ఆమె మృతి పట్ల ముస్లిం ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఖైరూన్‌నిసార్ బేగమ్ అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం నిర్వహించారు.

రెడ్డి కిక్‌కు.. ఫుట్‌బాల్ ఔట్!

స్టాక్ పెట్టుకున్న బాల్స్‌ను ఏంచేయాలో తెలియక లబోదిబోమంటున్న వ్యాపారులు



బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 14: ఇప్పటి దాకా ఎన్నికలు వస్తే చాలు కొప్పళ, బళ్లారి జిల్లాల్లో కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ(కెఆర్‌పిపి) చిహ్నం ఫుట్‌బాల్‌దే జోరు. ఆ పార్టీ వ్యవస్థాపకులు జనార్దన్ రెడ్డిని మెప్పించేందుకు పార్టీ కార్యకర్తలు ఫుట్‌బాల్‌ను కొనుగోలు చేసి సమావేశాల్లో చేతుల్లో పెట్టుకుని ప్రదర్శించేవారు. గాలి జనార్దన్ రెడ్డి 15 నెలల క్రితం పార్టీ స్థాపించినప్పటి నుంచి బళ్ళారి, కొప్పళ జిల్లాల్లో ఫుట్‌బాల్‌కు డిమాండ్ భారీగా ఉండేది. గత ఏడాది శాసనసభ ఎన్నికల సమయంలో రెడ్డి తమ ప్రతి ప్రసంగంలో తనకు ఎదురొస్తే ఫుట్‌బాల్ ఆడుతానంటూ...ప్రజలను అబ్బుర పరిచేవిధంగా ప్రసంగాలు చేస్తుంటే... అభిమానులు నిలబడిన చోటే ఫుట్‌బాల్ చూపించి శక్తి ప్రదర్శన చేసేవారు. రెడ్డి ప్రసంగాలతో ఉగ్రూతలూగిన పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున ఫుట్‌బాళ్ళు కొనుగోలు చేయడంతో.. క్రీడా సామగ్రి వ్యాపారులు కూడా లాభాలతో ఉప్పొంగి పోయేవారు.

గత శాసనసభ ఎన్నికల్లో కెఆర్‌పిపి ప్రముఖులు పిల్లలకు, క్రీడాకారులకు ఫుట్‌బాల్ గిఫ్ట్‌గా ఇచ్చేవారు. తమ పార్టీ గుర్తుకు ఓటు వెయ్యాలని ప్రచారం చేశారు. క్రీడా కారులకు ఫ్రీగా ఫుట్‌బాల్ చేతి కందుతుండగా, నాయకులు తక్కువ ఖర్చుతో ఎన్నికల ప్రచారం ముగించే వారు. వీరిద్దరి నడుమ క్రీడా సామగ్రి వ్యాపారులు లాభం పొందేవారు. లోక్‌సభ ఎన్నికలు వస్తాయని, శాసనసభ సభ ఎన్నికల్లో మాదిరిగా ఈ సారి కూడా ఫుట్‌బాల్ జోరుగా ఉంటుందని ఆశించిన వ్యాపారస్తులకు గొంతులో వెలక్కాయ పడినట్లయింది. లోక్‌సభ ఎన్నికలను నమ్ముకుని.. ఒకటికి రెండింతలు ఫుట్‌బాల్స్‌కు ఆర్డర్ ఇచ్చారు. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో కెఆర్‌పిపి పోటీ చేస్తుందని, ఫుట్‌బాల్స్ అమ్ముడుబోతాయని నిరీక్షించిన వ్యాపారులకు చేదు అనుభవం ఎదురైంది. జనార్దన్ రెడ్డి ఫుట్‌బాల్ వదిలేసి కమలం పట్టుకోవడంతో కెఆర్‌పిపిని నమ్ముకున్న ఫుట్ బాల్‌వ్యాపారులు ఒక్కసారిగా కంగుతిన్నాల్సి వచ్చింది. ఫుట్‌బాల్ అమ్మకాల ద్వారా లాభాలు పొందవచ్చుననుకున్న వ్యాపారులు 'వాక్ ఓవర్' అంటూ రెడ్డి బయటకు వెళ్ళిపోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. స్టాక్‌పెట్టుకున్న ఫుట్‌బాల్స్‌తో ఎక్కడ ఆడాలో అర్థంకాక జుట్టుపీక్కుంటున్నారు.



సిరుగుప్పలో అంబేడ్కర్ జయంతి

సిరుగుప్ప, ఏప్రిల్ 14: తాలుకావ్యాప్తంగా ఆదివారం ఘనంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. రాజ్యాంగ రచన చేసిన అంబేడ్కర్ విగ్రహాలకు, భావచిత్రపటాల వద్ద నివాళులర్పించారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాంగ్రెస్ అభ్యర్థి విస్తృత ప్రచారం

తోరణగల్లు, ఏప్రిల్ 14 : బళ్లారి నియోజకవర్గ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తుకారామ్ ఆదివారం తారానగర్ రోడ్డు, బసాపురం, కురేకుప్ప తదితర చోట్ల విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి బీజేపీ కన్నా కాంగ్రెస్ వారే ఎక్కువ సేవలు అందించారన్నారు. బ్యాంకులు జాతీయం చేయడంలోనూ అలాగే జిందాల్ ఫ్యాక్టరీ ఎస్ఎండీసీ కంపెనీకి రావడంలోనూ కాంగ్రెస్ ప్రముఖ పాత్ర పోషించిందని పేర్కొన్నారు. బీజేపీ కోటి ఉద్యోగాలు కల్పిస్తామని, అలాగే బ్యాంకు అకౌంట్లో లక్షలు వేస్తామని చెప్పారని అవేమీ జరగలేదన్నారు. అదానీ లాంటి ప్రముఖ కంపెనీలకు మాత్రమే సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. అందువలన కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. ఊపిరిఉన్నంత వరకు ప్రజా సేవలో ఉంటానని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పక్షాలకు చెందిన ఎస్ స్వామి, మారి స్వామి, జ్ఞానేష్, సుభాన్ సాబ్, అజీష్, నజీర్ తదితర 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ కేఎస్ఎల్ స్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏకాంబరప్ప, కాంగ్రెస్ ప్రముఖులు జీ రామాంజిని, గురుపాదప్ప, గ్రామ పంచాయతీ అధ్యక్షులు నాగరాజు, కౌసప్ప పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న తుకారామ్

అంబేడ్కర్ ఆశయ సాధనకు పనిచేద్దాం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే శివరాజ్ పాటీల్

రాయచూరు, ఏప్రిల్ 14 : ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గంలో పయనిస్తు ఆయన ఆశయాల సాధన కోసం కలిసికట్టుగా పని చేద్దామని రాయచూరు జిల్లా అధికారి చంద్రశేఖర్ నాయక్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా యంత్రాంగం, జడ్పీ, నగరసభ, సాంఘిక సంక్షేమ శాఖల సంయుక్తాధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో దివంగత నాయకుడి విగ్రహానికి ప్రజాప్రతినిధులు,అధికారులు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటీల్, రాయచూరు లోకసభ బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్, జేడీఎస్ జిల్లాధ్యక్షుడు ఎం.విరుపాక్షి, జేడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహంతేష్ పాటీల్ అత్తనూర్, జేడీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణతో పాటు వివిధ దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాసిర్ హుస్సేన్‌కు వ్యతిరేకంగా నల్లజెండాల ప్రదర్శన

బళ్లారిరూరల్, ఏప్రిల్ 14 : బళ్లారి నగరానికి ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుస్సేన్ రాకను నిరసిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షులు మోకా అనిల్ నాయుడు నేతృత్వంలో నాసిర్ హుస్సేన్ డౌన్ డౌన్ అంటూ నల్లజెండాలను ప్రదర్శించారు. హుస్సేన్ లాంటి నాయకులు మన భారతదేశం పరువు తీస్తున్నారని, ఆయన ఆధ్వర్యంలో కొందరు పాకిస్తాన్ జిందాబాద్ అనడం హేయమైన చర్య అన్నారు. ఆయన వైఖరిని ఖండిస్తూ కలెక్టర్ కార్యాలయం ముందు బీజేపీ మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి, బుడా మాజీ అధ్యక్షులు పాలన్న, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కార్పొరేటర్లు పెద్దఎత్తున జిల్లా కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇలాంటి నాయకులు దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని డీఆర్ పోలీసు గ్రౌండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిద్దప్ప, మారుతీ ప్రసాద్, గుర్లింగన గౌడ, కార్పొరేటర్ హనుమంతు, యర్రగుడి ఈరన్న, అశోక్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



నాసిర్ హుస్సేన్‌కు వ్యతిరేకంగా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

హుస్సేన్‌ను స్వాగతిస్తూ బైకు ర్యాలీ

అంతకుముందు బళ్లారికి వచ్చిన రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుస్సేన్‌ను ఇన్‌ఛార్జ్ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు స్వాగతించారు. ఇంద్ర సర్కిల్ నుండి రాయల్ సర్కిల్, మోతి సర్కిల్ మీదుగా కౌల్ బజార్ వరకు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు బైకు ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు, బీఆర్ఎల్ శ్రీనివాస్, కుబేర, మించు శ్రీనివాస్, ప్రభంజన్, నందీష్, విక్కితో పాటు బోయపాటి విష్ణువర్దన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ ర్యాలీలో పెద్దఎత్తున పాల్గొన్నారు.

కంప్లిలో ఘనంగా జయంతి వేడుకలు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కంప్లి, ఏప్రిల్ 14 : కంప్లి పట్టణంలో అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అంబేడ్కర్ కూడలిలో భావచిత్రపటానికి పూలమాలలతో పూజలు నిర్వహించారు. అలాగే ప్రభుత్వాస్పత్రిలో భీమ్ ఆర్మీ భారత్ ఏకతా మిషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. భీమ్ ఆర్మీ విద్యార్థి శాఖ రాజ్య అధ్యక్షులు రఘు, జిల్లా అధ్యక్షులు డాక్టర్ రవీంద్ర వర్మ, రవి మన్నూరు. తదితరులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు ఎదగాలని కోరారు. అలాగే ఎండీ క్యాంపులో జైభీం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పిల్లలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో కూడా తహసీల్దార్ శివరాజ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ణ, బుజ్జికుమార్, విరుపాక్షి, గంగన్న, రాజు, హుస్సేనప్ప, బూదిగుంప హుస్సేన్‌సాబ్, వెంకటేష్, చంద్రశేఖర గౌడ, తాలుకా అధ్యక్షులు సన్నప్ప, హరీష్, హరికృష్ణ, రామన్న, సీఆర్ హనుమంతు, సీఐ ప్రకాష్, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రైతు విరోధి: నడహల్లి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 14: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని రైతు మోర్చా అధ్యక్షుడు నడహల్లి అన్నారు. బీజేపీ జిల్లాకార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన సభలో రైతు మోర్చా అధ్యక్షుడు నడహల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా యడ్యూరప్ప ఉన్న సమయంలో కిసాన్ సమన్ యోజన వంటి రైతు అనుకూల పథకాలకు రూ 4వేల రూపాయలు ఇచ్చేవారని, ప్రస్తుతం రైతుల పిల్లలకు విద్యానిధి, స్కాలర్‌షిప్‌ను, రైతుల ప్రోత్సకాలను కాంగ్రెస్ నిలిపేసిందన్నారు. జిల్లా రైతు మోర్చా అధ్యక్షుడు ఐనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కేంద్రప్రభుత్వ పథకాలైన కిసాన్ సమ్మాన్ యోజన రూ. 6వేలు నేరుగా రైతుల ఖాతాలో జమచేస్తోందని, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఎరువులపై ఎక్కువ సబ్సిడీ ఇస్తోందన్నారు. దేశం మొత్తం మీద ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత యడ్యూరప్పదేనని గాలి లక్ష్మీఅరుణ అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ రైతు అనుకూల పథకాలను ప్రతి రైతుకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో గురులింగనగౌడ, శివరుద్రప్ప, దమ్మూరు శేఖర్, అనిల్‌నాయుడు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నడహల్లి తదితరులు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రాయచూరు జిల్లా అధికారి చంద్రశేఖర్

హోసూరు జోన్

వైభవంగా జ్ఞాన శక్తి వినాయకుని ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

హోసూరు ఏప్రిల్ 14: హోసూరు కామరాజర్ నగర్‌లో వెలసిన శ్రీ జ్ఞాన శక్తి వినాయక ఆలయంలో తమిళుల నూతన సంవత్సరాది సందర్భంగా 15వ సంవత్సరం వార్షిక ముడుపుల చెల్లింపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో జ్ఞానశక్తి ఈశ్వరుడు, శివ త్రిమూర్తులు అయిన గణపతి, సుబ్రహ్మణి, అయ్యప్ప ఉత్సవర్లను కూడా ప్రతిష్టించారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆలయంలో ఏర్పాటు చేసిన యాగ శాలలో గణపతి హోమంతో పాటు నవగ్రహ హోమం, కూడా నిర్వహించారు. యాగానికి పూర్ణ శక్తిని ప్రసాదించిన అనంతరం కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సమయంలో శివాచార్యులు మంత్రాలు పఠించి, కళశంలోని పవిత్ర జలాన్ని కుంభంపై పోసి యాగంలో కలశ పూజ నిర్వహించారు. విశేష అభిషేక ఆరాధనల అనంతరం ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ జ్ఞాన వినాయకుడికి దీపారాధన నిర్వహించారు. తమిళుల నూతన సంవత్సరాది రోజైన ఆదికారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వినాయకుడిని పూజించారు. అనంతరం కామరాజ నగర్‌లో ప్రధాన వీధుల్లో స్వామి వారిని ఊరేగించారు.

వందశాతం ఓటింగ్ లక్ష్యం

హోసూరు, ఏప్రిల్ 14: లోక్‌సభ ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ లక్ష్యంగా అధికారులు పలు జాగృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో ప్రజలు తమ ఓటు హక్కు ప్రాధాన్యతను విస్మరించరాదని సూచించారు. ఎన్నికల సంఘం, బిఎస్ఐ శనివారం నిర్వహించిన ఓటింగ్ అవగాహన పాదయాత్రలో స్థానికులు పాల్గొన్నారు. హోసూరు మున్సిపల్ కార్పొరేషన్, కృష్ణగిరి జిల్లా ఎన్నికల సంఘం, బిఎస్ఐ ఆధ్వర్యంలో 100 శాతం ఓటింగ్ ఆవశ్యకతను తెలిపేలా కరుణానిధి స్పోర్ట్స్ గ్రౌండ్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వందమందికిపైగా బిఎస్ఐ సభ్యులు పాల్గొని ఎన్నికల ప్రతిజ్ఞ చేశారు. బ్యాండ్ వాయిద్యాలతో పాటు నృత్యాలు, చేస్తూ అవగాహన కల్పించారు. అనంతరం ఎన్నికల అవగాహన నినాదాలతో కూడిన బ్యానర్లు చేతబట్టి కామరాజ్ కాలనీ నేతాజీ రోడ్డు, ఎంజీ రోడ్డుల్లో ర్యాలీగా సాగి తిరిగి క్రీడా మైదానానికి చేరుకున్నారు.

బాగలూరులో ఘనంగా అంబేడ్కర్ జయంతి

హోసూరు ఏప్రిల్ 14 : హోసూరు సమీపంల్లోని బాగలూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంల్లో అంబేడ్కర్ 133 వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కృష్ణగిరి జిల్లా హోసూరు యూనియన్ బాగలూరు సర్కిల్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారతరత్న అంబేడ్కర్ 133 వ జయంతి సభ జరిగింది. విశ్రాంత విద్యాశాఖాధికారి కెంపన్న అధ్యక్షత వహించారు. కార్యక్రమంల్లో హోసూరు యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లప్పన్, హోసూరు యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, శివ హోసూరు యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శి శేఖర్, అలసపల్లి లోకేశ్, హోసూరు యూనియన్ కాంగ్రెస్ ఉప కార్యదర్శి శ్రీనివాస్, వెంకటేశ్, నాగరాజ్, శంకరప్ప, మురుగన్, వెంకటేశ్, ఈరప్పతో పాటు పలువురు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

రాజ్యాంగ నిర్మాణంలో ఆయనదే కీలకపాత్ర

అంబేడ్కర్‌కు నివాళులర్పించిన ప్రొఫెసర్ పోతే

రాయచూరు, ఏప్రిల్ 14 : నవ భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని రాయచూరు నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నగరంలోని రంగమందిరంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన గుల్బర్గా విశ్వవిద్యాలయం కన్నడ అధ్యయన సంస్థ డైరెక్టర్ ప్రొ.ఎచ్‌టీ పోతే మాట్లాడుతూ, చట్టబద్ధమైన పాలనతో పాటు క్రమశిక్షణతో కూడిన సామాజిక జీవనం సాగించేందుకు వీలుగా భారత రాజ్యాంగాన్ని తయారు చేయడంలో అంబేడ్కర్ కీలకపాత్ర పోషించారన్నారు. స్వయంకృషితో అంచెలంచలుగా ఎదిగిన అంబేడ్కర్, భారత ప్రభుత్వంలో న్యాయమంత్రిగా ప్రజలకు విశిష్ట సేవలందించారన్నారు. కాగా హైందవ ధర్మంలోని సనాతన పద్ధతుల పట్ల విముఖత కనబరచిన ఆయన, బౌద్ధ మతం స్వీకరించడమేగాక, జ్ఞానమే శక్తియని ప్రపంచానికి చాటారన్నారు. ఆయన చూపిన మార్గాన్ని అనసరించడం ద్వారా దివంగత నేతకు నిజమైన నివాళులర్పిద్దామని పిలుపునిచ్చారు. భిన్న జాతులు, మతాలను ఒక్కతాటి పై తెచ్చేందుకు వీలుగా లౌకిక రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేడ్కర్ భారతీయులకు ఆదర్శ ప్రాయుడన్నారు. సమాజంలో పెరిగిపోతున్న దౌర్జన్య ధోరణులను అరికట్టేందుకు విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కల్పించాలన్నారు. గుణాత్మక విద్యనందించడంతో పాటు నీతివంతమైన సమాజనిర్మాణం కోసం ప్రతిఒక్కరం కృషి చేద్దామన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొ.ఎచ్‌టీ పోతే

పిడుగు పడి యువకుడి మృతి..!

రాయచూరు, ఏప్రిల్ 14 : జిల్లా వ్యాప్తంగా ఆదివారం కురిసిన అకాల వర్షం పలు చోట్ల ప్రజలకు చల్లటి గాలులతో స్వాంతన కలిగించినా మరికొన్ని చోట్ల ఇబ్బందికర పరిస్థితిని కల్పించింది. సింధనూరు తాలూకా మల్లాపూర్ క్యాంప్ వద్ద అకాలంగా కురిసిన వర్షానికి తోడు పిడుగు పడడంతో గ్రామానికి చెందిన శాంతప్ప(18) మృత్యువాత పడ్డాడు. ఆదివారం తెల్లవారు జామున పొలం పనులు చేసుకుంటున్న అతడు పిడుగు పాటుకు గురై అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అరుణ్ కుమార్ దేసాయి సంఘటన స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా సహాయం అందించేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.



శాంతప్ప(ఫైల్)

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

లియోనార్డో డావిన్సీ (జయంతి)



కళా ప్రపంచంలో పేరొందిన లియోనార్డో డావిన్సీ 1452 ఏప్రిల్ 15న ఇటలీదేశంలో జన్మించారు. పాశ్చాత్య కళా ఖండాలకు పెట్టిందిపేరు. శాస్త్రజ్ఞుడు, గణితజ్ఞుడు, ఇంజనీర్, శిల్పకారుడు, ఆర్కిటెక్ట్, వృక్ష శాస్త్రజ్ఞుడు, సంగీతకారుడు, రచయిత. ఆయన గీసిన 'మోనాలిసా', 'ది లాస్ట్ సప్పర్' చిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరొందాయి. 1519 మే 2న కన్నుమూశారు. సృజనాత్మకతపై అవగాహన కల్పించేందుకు ఆయన జయంతిని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఆర్ట్ (ఐఏఏ) ఆధ్వర్యంలో 'వరల్డ్ ఆర్ట్ డే' నిర్వహిస్తోంది. 2012నుంచి అమలు చేస్తున్నారు.

గురునానక్ (జయంతి)




సిక్కుమత గురువు గురునానక్ 1469 ఏప్రిల్ 15న లాహోర్‌లో జన్మించారు. పది మంది సిక్కు గురువులలో తొలివ్యక్తి. హిందూ, ఇస్లామియా గ్రంథాలను చదివారు. కానీ రెండుమతాలకు భిన్నంగా సిక్కుమతాన్ని స్థాపించారు. ఆసియాఖండ వ్యాప్తంగా పర్యటించి దేవుడు ఒక్కడే (ఏక్ ఓంకార్) అని బోధించారు. నానక్ తర్వాత గురుపరంపర సాగింది. సత్యం, అహింస మార్గంలో నడవాలని చాటిచెప్పారు. ఆయన రచనలు, బోధనలు 'గురుగ్రంథ్ సాహిబ్'గా పేరొందాయి. 1539 సెప్టెంబరు 22న కన్నుమూశారు.

ఉస్తాద్ సుల్తాన్‌ఖాన్ (జయంతి)



'పద్మభూషణ్' పురస్కార గ్రహీత ఉస్తాద్ సుల్తాన్‌ఖాన్ 1940 ఏప్రిల్ 15న రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్‌లో జన్మించారు. ప్రముఖ సారంగి కళాకారుడు. శాస్త్రీయ సంగీతంలో రాణించారు. ఇండియన్ ఫ్యూజన్ గ్రూప్ 'తబలా బీట్ సైన్స్' సంస్థాపక సభ్యులు. తండ్రివద్దనే శిక్షణ పొంది 11వ యేటనే ప్రదర్శన ఇచ్చారు. 20వ ఏట ఆలిండియా రేడియో గుజరాత్‌లో కెరీర్ ప్రారంభించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. సంగీత నాటక అకాడమీ, గోల్డ్ మెడలిస్ట్ ఆఫ్ కర్ణాటక తదితర పురస్కారాలు అందుకున్నారు. 2011 నవంబరు 27న కన్నుమూశారు.

జెఫ్రీ ఆర్చర్ (పుట్టినరోజు)



బ్రిటన్‌కు చెందిన పేరొందిన నవలా రచయిత జెఫ్రీ హోవార్డ్ ఆర్చర్ 1940 ఏప్రిల్ 15న యునైటెడ్ కింగ్‌డమ్ దేశంలో జన్మించారు. చిన్నకథలతోపాటు నాటికలు రాయడం ప్రత్యేకత. కన్సర్వేటివ్ పార్టీ డిప్యూటీ ఛైర్మన్‌గా, ఎంపీగా వ్యవహరించారు. ఆయన రచనలు 33 భాషలలో 97 దేశాలలో ప్రచురితమయ్యాయి. ఫిక్షన్ (కాల్పనిక) విభాగంలో 19సార్లు బెస్ట్ సెల్లెర్‌గా నిలిచారు. కేన్ అండ్ ఎబెల్' నవల 3.5 మిలియన్‌లకుపైగా అమ్ముడయ్యింది. ఆయన తాజా నవల 'హిడ్డెన్ ఇన్ ప్లైయిన్ సైట్' 2020లో ప్రచురితమైంది.

నిర్మాత సౌందర్య జగదీశ్ ఆత్మహత్య

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కన్నడ సినీ రంగంలో పేరొందిన సౌందర్య జగదీశ్ (54) అనుమానాస్పదరీతిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహాలక్ష్మి లే అవుట్‌లో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. సుమారు 9 గంటలకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆర్థిక వ్యవహారాలే కారణమని తెలుస్తోంది. రూంలో ఉరేసుకున్న సంగతిని గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. అప్పు పప్పు, స్నేహితరు, మస్త్ మజా మాడి, రామ్‌లీలా తదితర సినిమాలు నిర్మించి పేరొందారు. అంతేకాక నగరంలో జెట్‌లాగ్ పబ్ కూడా కల్గిన ఆయన బిల్డర్‌గా కూడా రాణించారు. చాలెంజింగ్ స్టార్ దర్శన్, రాక్‌లైన్ వెంకటేశ్ తదితరులతో ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయి. కొన్ని నెలల క్రితం కాటేర చిత్రబృందం జెట్‌లాగ్ పబ్‌లో రాత్రి గడువుకు మించి పార్టీ చేసుకున్నారన్న వివాదం నేపథ్యంలో 25 రోజులపాటు బార్ లైసెన్స్ రద్దు అయ్యింది. రుణ వసూళ్లకు సంబంధించి బ్యాంకు అధికారులు ఇంటిని జప్తు చేసినట్లు తెలుస్తోంది. ఇలా పలు సమస్యలతో ఉన్న జగదీశ్ మనస్తాపానికి గురైన జగదీశ్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని కుటుంబీకులు అభిప్రాయపడ్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



సౌందర్య జగదీశ్ (ఫైల్)

హాల్‌టికెట్ల విడుదల

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 14: జిల్లాకేంద్రంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను ఆన్‌లైన్లో ఉంచామని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీ ఆదివారం జరిగే ప్రవేశపరీక్ష ఐదో తరగతి స్థాయిలో ఉంటుందన్నారు. పరీక్ష ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో రాయవచ్చన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. సమయానికి అరగంట ముందే పరీక్ష హాల్‌కు విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. హాల్‌టికెట్లను cse.ap.gov.in, apms.apcfss.in/studentlogin వెబ్‌సైట్‌లలో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు పాఠశాల లో సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ధర్మవరం, ఏప్రిల్ 14: పట్టణంలోని కొత్తపేటలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్‌పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గుట్టకిందపల్లికి చెందిన ఖాదర్ బాషా బైక్‌లో కొత్తపేటకు వస్తుండగా కొత్తపేట సర్కిల్ వద్ద ఎదురుగా మరో ద్విచక్రవాహనం వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ఖాదర్‌బాషా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరంఅనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

నిండు సంస్కృతికి నిలువుటద్దం ఉగాది

▸▸ ఉత్సాహంగా ఉగాది పురస్కారాల ప్రదానం

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి సంస్కృతికి ప్రతిబింబంగా ఉగాది ఉందని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు ఏ రాధాకష్ణరాజు అభిప్రాయపడ్డారు. బెంగళూరు నగరంలోని తెలుగు విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో ఆదివారం ఏర్పాటైన క్రోధినామ ఉగాది ఉత్సవంలో ఆయన ప్రసంగిస్తూ దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ వేర్వేరు పేర్లతో ఉగాది నిర్వహిస్తున్నారన్నారు. ఇటీవలికాలంలో మన సంస్కృతి సంప్రదాయాలను పక్కనపెట్టి విదేశీ సంస్కృతిని ఆచరిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇతర దేశాలనుంచి మనదేశానికి వచ్చినవారు సైతం మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. మన భాషా సంస్కృతులే మనకు శ్రీరామరక్ష అన్నారు. భాషాసంస్కృతులు నశిస్తే జాతి మనుగడ శూన్యమన్నారు. వ్యక్తిగత శీలం, సౌశీల్యం ద్వారానే ఉగాది ఉత్సవాలకు సార్థకత ఏర్పడుతుందన్నారు. సమాజాన్ని సంఘటిత పరిచే శక్తి మాతృభాషకు ఉందంటూ మాతృభాషను కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యత మనందరితోపాటు తెలుగురాష్ట్ర ప్రభుత్వాలపై కూడా ఉందన్నారు. రాజ్యాంగపరమైన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లకుండా మాతృభాషా బోధన, పరిపాలనా విధానం ఎంతో అవసరమని తద్వారా మాతృభాషను భావితరాలకు పదిలంగా అందించవచ్చునన్నారు. కార్యక్రమంలో దక్షిణభారత ప్రముఖ చలనచిత్రనటుడు చరణ్‌రాజ్‌కు ఉగాది విశిష్ట పురస్కారం, ప్రముఖ కన్నడ రచయిత్రి నాడోజ డాక్టర్ కమలా హంపనకు ఉగాది సాహితీ పురస్కారం, తెలుగు రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం సంచాలకురాలు డాక్టర్ సీ మృణాళినికి ఉగాది పురస్కారంతో రూ.10,116 నగదు, దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ చంద్రశేఖర్ కంబార, కసాప అధ్యక్షుడు డాక్టర్ మహేశ్‌జోషి, గౌరవ అతిథిగా తెలుగు విజ్ఞాన సమితి విద్యాట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ కే శ్యామరాజు, సమితి ఉపాధ్యక్షులు కే గంగరాజు, ఆర్ ఆదికేశవులునాయుడు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మిరెడ్డి, పారిశ్రామికవేత్త కోగంటి సత్యం పాల్గొన్నారు.



ఉగాది పురస్కారాల సన్మానంలో ప్రముఖులు

నన్ను వీక్ క్యాండిడేట్ అన్నారు...

▸▸ కాంగ్రెస్ అభ్యర్థి గీతా శివరాజ్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి గీతా శివరాజ్‌కుమార్ తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నా పోటీతో ప్రతిపక్షాల్లో భయం నెలకొందని అందుకే నన్ను వీక్ కాండిడేట్ అన్నారని కాంగ్రెస్ అభ్యర్థి గీతాశివరాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. శివమొగ్గలో ఆదివారం సోదరుడు, విద్యాశాఖ మంత్రి మధుబంగారప్పతో కలసి మీడియాతో మాట్లాడారు. సోమవారం నామినేషన్ వేస్తానని ఈ సందర్భంగా డీసీఎం డీకే శివ కుమార్, మంత్రి మధుబంగారప్ప, శివరాజ్‌కుమార్ పాల్గొంటారన్నారు. వీరితోపాటు సినిమా నటులు తమకు మద్దతుగా ప్రచారం చేస్తారన్నారు. ప్రధాని మోదీ హవా గురించి తనకు తెలియదన్నారు. తాను ఎదుర్కోవడంపై ఆలోచించడం లేదని, తన పని తాను చేసుకు వెళ్తానన్నారు. మాజీ మంత్రి ఈశ్వరప్ప పోటీ వల్ల తమకు ఎటువంటి లాభం, నష్టం అనే ప్రశ్న లేదన్నారు. 2014 ఎన్నికలకు ఈసారి ఎన్నికలకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. గతంలో జేడీఎస్ తరపున పోటీ చేశానని ఈసారి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్నట్టు తెలిపారు. తాను నియోజకవర్గవ్యాప్తంగా పర్యటించానని తాగునీరు, విద్యుత్ సమస్య, కరువు సమస్యలపై ప్రజలు తమ గోడు వెళ్లబోసుకున్నారన్నారు. నియోజకవర్గంలో ఎక్కువ సమయం గడుపుతానన్నారు. తన పిల్లలు పెద్దవారు అయ్యారని ఎటువంటి సమస్య లేదన్నారు. శివమొగ్గ, సొరబలోని కుబటూరులో నాకు ఇల్లు ఉందన్నారు. జిల్లాలో బగర్‌హుకుం పత్రాల సమస్య ఉందని, సోదరుడు మధుబంగారప్పతో కలసి సమస్యను పరిష్కరిస్తామన్న హామీ ఇచ్చారు. మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసన్నకుమార్, ఆయనూరు మంజునాథ్, కలగూడు రత్నాకర్, కాంగ్రెస్ ప్రముఖులు పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో రైతు మృతి

▸▸ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థుల నిరసన



గ్రామస్థులతో చర్చిస్తున్న అధికారులు

బంగారపేట, ఏప్రిల్ 14: ఏనుగు దాడిలో పోలేనహళ్ళికి చెందిన రైతు నారాయణప్ప (45) మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున తమలపాకులు విక్రయించేందుకు కాళికాంబ దేవస్థానం వద్ద బస్సుకోసం వస్తుండగా ఒక్కసారిగా అడవిలోనుంచి వచ్చిన ఏనుగు దాడి చేయడంతో నారాయణప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబీకులు, గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్థులు నిరసన చేపట్టారు. కాగా అడవి ఏనుగు దాడిలో మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.15లక్షల పరిహారం, కుటుంబీకులకు ఉద్యోగం కల్పించాలని, అంతేకాక ఏనుగుల దాడులకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతుసంఘం తాలూకా అధ్యక్షుడు కదిరినత్త శ్రీరామప్ప డిమాండ్ చేశారు. నిరసనలో రైతుసంఘం రాష్ట్ర ప్రముఖుడు మరగల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కోట్లాది రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేసిన సోలార్ వ్యవస్థ నాసిరకం కావడంతో ప్రయోజనం లేకపోయిందని, కంచె వేసినా వృథాగా మారిందన్నారు. గ్రామపంచాయతీ సభ్యుడు జయణ్ణ మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాన్ని తాలూకా యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. రోడ్డు, ఆసుపత్రి, తాగునీరు తదితర సమస్యల మధ్య కరెంటు దోబూచూలాతుండడంతో పంటల సాగు కష్టంగా మారిందన్నారు. మరోవైపు వన్యప్రాణుల దాడులతో పంటలు నష్టపోతుండగా, ప్రాణాలు అరచేతబట్టుకుని జీవనం సాగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కామసముద్ర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ జోక్యం చేసుకుని గ్రామస్థులు, అధికారుల మధ్య సమన్వయం చేశారు. నిరసనలో రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే నారాయణగౌడ, ప్రభాకరరెడ్డి, లక్ష్మి నారాయణ, శ్రీరామ్, గుళ్ళహట్టి లక్ష్మణ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీని మళ్లీ ప్రధాని చేయడమే లక్ష్యం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 14: నరేంద్రమోదీని మరోసారి ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. కోలారు లోక్‌సభ జేడీఎస్-బీజేపీ మైత్రి అభ్యర్థి మల్లేశ్‌బాబుతో కలసి ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్, బీజేపీ నాయకులు సీకల్ రామచంద్రగౌడ, మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ తదితరులు పట్టణంలోని బీజేపీ కార్యాలయం సేవాసౌధలో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ప్రధాని సేవలను కొనియాడారు. రాష్ట్రంలో జేడీఎస్‌ను అణగతొక్కేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందన్నారు. అయితే రాష్ట్రంలో కోలారు, మండ్య, హాసన్ లోక్‌సభ నియోజకవర్గాలనుంచి జేడీఎస్ అభ్యర్థులు లోక్‌సభ బరిలో నిలిచారన్నారు. జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడ సూచన మేరకు అభ్యర్థి విజయానికి కార్యకర్తలంతా కలసికట్టుగా శ్రమించాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీకి దేశం నుంచే కాక ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయన్నారు. బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ మాట్లాడుతూ పలు సర్వేల ప్రకారం నరేంద్రమోదీ నాయకత్వానికి ఆదరణ పెరిగిందని, మరోసారి ప్రధాని అయ్యే అవకాశం ఉందన్నారు. కోవిడ్ వంటి క్లిష్ట సమయంలో ప్రజలందరికీ ఉచిత వ్యాక్సిన్ సమకూర్చి ప్రాణాలు కాపాడి అందరిలో ధైర్యం నింపారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, బంకు మునియప్ప, సీకల్ ఆనందగౌడ, నరేశ్, బీజేపీ సీనియర్ నాయకుడు రమేశ్ బాయరి, తాదూరు రఘు, జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు డీబీ వెంకటేశ్, రఘునాథరెడ్డి, డాక్టర్ ధనంజయ్‌రెడ్డి, నగరసభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో ఎమ్మెల్యేతోపాటు బీజేపీ, జేడీఎస్ నాయకులు

అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శనీయం

బాగేపల్లి, ఏప్రిల్ 14: భారతరత్న బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు నేటికీ ఆదర్శనీయమని ఘంటంవారిపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామసుబ్బమ్మ అభిప్రాయపడ్డారు. ఆదివారం పాఠశాలలో అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సమాజంలో అస్పృశ్యత, అసమానత, అశాస్త్రీయ సంప్రదాయాలను అంబేడ్కర్ వ్యతిరేకించి ప్రజలను చైతన్య పరిచారన్నారు. కులవ్యవస్థపై పోరాటం చేశారన్నారు. విద్యతోనే ప్రగతి సాధ్యమని ప్రోత్సహించారన్నారు. విద్యావేత్త, న్యాయ నిపుణుడు, అర్థశాస్త్రవేత్తగా రాజ్యాంగం రూపొందించారన్నారు. రాజ్యాంగ సమితి అధ్యక్షుడిగా ఆయన సేవలు అపారమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎస్ఎన్ సంధ్యా, జంగమ ఎన్ శ్రీనివాస్, పీ నారాయణస్వామి, ఎల్ రవి, సిబ్బంది హెచ్ఆర్ రఘునాథరెడ్డి, రామచంద్రప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వపాఠశాలలో అంబేడ్కర్ జయంతి

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట, ఏప్రిల్ 14: బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతిని సరళంగా ఆచరించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే మేలూరు బీఎన్ రవికుమార్ గృహ కార్యాలయంలో ఆదివారం అర్థవంతంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రటానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ అంబేడ్కర్ భౌతికంగా లేనప్పటికీ ఆయన పేరు ప్రపంచ వ్యాప్తంగా మారుమోగుతోందన్నారు. అంతటి సాధనకు ఆయన ఎంతో శ్రమించారన్నారు. న్యాయ, ఆర్థిక, రాజకీయ శాస్త్రాలలో రాణించి ప్రపంచం మెచ్చేంతటి గొప్ప రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఆయన ఆదర్శాలు నేటికీ అనుసరణీయమన్నారు. ఈ సందర్భంగా మేలూరు గ్రామపంచాయతీ అధ్యక్షుడు ఉమేశ్, భూ అభివృద్ధి బ్యాంకు మాజీ డైరెక్టర్ శంకర్, మేలూరు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే రవికుమార్ నివాళులు

కాంగ్రెస్ అభ్యర్థి రాజీవ్‌గౌడకు బీజేపీ ఎమ్మెల్యే మద్దతు

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉత్తర లోక్‌సభ నియోజకవర్గంలో ప్రొఫెసర్ ఎంవీ రాజీవ్‌గౌడ పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రచారం చేశారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో యశ్వంతపుర బీజేపీ ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ పాల్గొని ఆయనకు మద్దతు ఇచ్చారు. యశ్వంతపుర శాసనసభ నియోజకవర్గంలోని అరగ, కగ్గలిపుర, తరళు గ్రామపంచాయతీ తటగుప్పె, సోమనహళ్ళి, నెలగుళి, కుంబళగోడు, రామోహళ్ళి, చుంచనకుప్పె, కొడిగేహళ్ళి గ్రామాలలో గ్రామపంచాయతీ స్థాయి సమావేశాలు నిర్వహించారు. లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థికి బీజేపీ ఎమ్మెల్యే మద్దతు పలకడంపై సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. ఇటీవల కొంత కాలంగా ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ బీజేపీ కార్య క్రమాలకు అంటీఅంటనట్టుగా వ్యవహరిస్తున్నారు. మొత్తమ్మీద రాజీవ్‌గౌడకు బీజేపీ ఎమ్మెల్యే మద్దతు ఇవ్వడం చర్చనీయాంశమైంది.



అంబేడ్కర్ జయంతిలో కాంగ్రెస్ అభ్యర్థి రాజీవ్‌గౌడతో బీజేపీ ఎమ్మెల్యే సోమశేఖర్

గుణాత్మక విద్యతోనే ప్రగతి

మహదేవపుర, ఏప్రిల్ 14: గుణాత్మకమైన విద్యతోనే ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. మండూరు పంచాయతీ హంచరహళ్ళిలో నేషనల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ మూడోశాఖను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రదేశాల్లో ఉత్తమ విద్యను అందించేందుకు ప్రముఖ విద్యాసంస్థలు చొరవ చూపాలని సూచించారు. విద్యార్థులకు చక్కటి విద్యతోపాటు నైపుణ్యం ఇవ్వడం ద్వారా వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసి చక్కటి సమాజానికి ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రోత్సహించాలన్నారు. పాఠశాల యజమాని జనార్ధనగౌడ మాట్లాడుతూ తక్కువఖర్చుతో గుణాత్మక విద్యను అందించేందుకు శ్రమిస్తున్నట్టు తెలిపారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు పాఠ్యేతర అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బిందు జే గౌడ, ఎన్‌సీఈ స్కూల్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ విజయ్‌కుమార్, రూరల్ బీజేపీ అధ్యక్షుడు నటరాజ్, బిదరహళ్ళి పంచాయతీ మాజీ అధ్యక్షుడు జీబీ రాజేశ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.



జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి తదితరులు

నేటి నుంచి శ్రీరామమందిర ఆలయ వార్షికోత్సవాలు



సీతారామలక్ష్మణ ఆంజనేయ మూర్తులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 14: పట్టణంలోని ఉల్లూరుపేటలో కొలువైన సీతారామస్వామి ఆలయ 13వ వార్షికోత్సవం మూడు రోజులపాటు జరగనుంది. 15న సోమవారం ఉదయం 7 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం వరకు వివిధ ధార్మిక కార్యక్రమాలు కొనసాగుతాయి. సాయంత్రం 4.30 గంటలనుంచి సీతారామ కల్యాణ మహోత్సవం జరగనుంది. 16న మంగళవారం కూడా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 17న బుధవారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని స్వామివార్లకు పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, అష్టోత్తర సేవ, మహామంగళారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం ఉంటుంది. సాయంత్రం 6 గంటలకు పురవీధులలో స్వామివారి పల్లకీ ఉత్సవం ఉంటుందని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు ప్రకటనలో కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

బీజేపీ 10శాతం హామీలూ అమలు చేయలేదు: సీఎం

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2018 ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన హామీలు 10 శాతమైనా అమలు చేయలేదని సీఎం సిద్దరామయ్య ఆరోపించారు. మడికేరి గోల్ఫ్‌గ్రౌండ్ హెలిప్యాడ్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన ఎన్నికల్లో 600 హామీలు ప్రకటించారని అయితే 60 కూడా అమలు చేయలేదన్నారు. ఎన్నికల ప్రణాళిక రూపంలో కొత్తభ్రమలు కల్పించారన్నారు. ప్రణాళిక కంటే ముందుగా ప్రకటించిన హామీలు ప్రతి ఒక్కరి ఖాతాకు రూ.15లక్షలు ఇస్తామన్నారని, ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం పెంపు ఏమయ్యాయన్నారు. మేక్ ఇన్ ఇండియా ఏమైందని ప్రశ్నించారు. అచ్చేదిన్ ఆయేగా అంటూ ఎద్దేవా చేశారు. నిత్యావసరాల ధరలు తగ్గాయా.., పదేళ్లలో ప్రధానమంత్రి మోదీ ఏం చేశారని ప్రశ్నించారు. వాటి గురించి వెల్లడించాలన్నారు. శ్రీనివాసప్రసాద్ రాజకీయాల్లో తనకు సమకాలీనుడని, 1974లో శాసనసభకు పోటీ చేశారని, కలసి రాజకీయాలు చేశామన్నారు. తమది సుదీర్ఘకాల స్నేహమన్నారు. ఆయన రాజకీయాలనుంచి రిటైర్మెంట్ ప్రకటించడంతో ఏ పార్టీకి మద్దతు ఇచ్చేది లేదని స్పష్టం చేశారన్నారు. ఈ తరుణంలో శ్రీనివాసప్రసాద్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయి ఆరోగ్యంపై ఆరా తీసానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలతో మహిళలు దారి తప్పారంటూ మాజీ సీఎం కుమారస్వామి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఆయన మానసికస్థితి గురించి తెలుసుకోవచ్చునన్నారు. రెండుసార్లు సీఎంగా వ్యవహరించిన కుమారస్వామి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సముచితం కాదన్నారు. మీడియా సమావేశంలో పశుసంవర్ధకశాఖ మంత్రి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షల నగదు స్వాధీనం

పావగడ, ఏప్రిల్ 14: ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన కంబదూరు, నాగలాపురం చెక్‌పోస్టులో ఆదివారం రూ.2లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఆంధ్రప్రదేశ్ కంబదూరు నుంచి ఓ కారు లో వస్తున్న ఇద్దరు వ్యక్తులను చెక్‌పోస్టులో తనిఖీ చేయ గా వారివద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.2లక్షల నగదు ఉండటంతో పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాళప్ప తెలిపారు.



నగదును చూపుతున్న పోలీసులు